# Prime Minister Addresses the virtual Global Vaccine Summit 2020

June 04, 2020

## వర్చువల్ గ్లోబల్ వ్యాక్సిన్ సదస్సు 2020లో ప్రసంగించిన ప్రధాన మంత్రి

జూన్ 04, 2020

అంతర్జాతీయ వ్యాక్సిన్ కూటమి గవి (జీఏవీఐ)కి 15 మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు భారత్ నేడు వాగ్దానం చేసింది.

బ్రిటన్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ నిర్వహించిన వర్చువల్ గ్లోబల్ వ్యాక్సిన్ సదస్సులో ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఇందులో 50 పైగా దేశాలకు చెందిన వ్యాపార దిగ్గజాలు, ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు, పౌర సమాజ ప్రతినిధులు, ప్రభుత్వాల మంత్రులు, దేశాధినేతలు మరియు దేశ నేతలు పాల్గొన్నారు.

ఈ కష్టకాలంలో ప్రపంచానికి భారత్ సంఘీభావంగా నిలుస్తోందని ప్రధాని తన ప్రసంగం సందర్భంగా తెలిపారు.

యావత్ ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా చూడాలని భారత నాగరికత నేర్పుతుందని శ్రీ మోదీ తెలిపారు. ఆ బోధనలకు అనుగుణంగా మహమ్మారి విజృంభణ సమయంలో భారత్ తన వంతు పాత్ర పోషించే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భారత్ తన వద్ద ఉన్న ఔషధాలను 120 పైగా దేశాలతో పంచుకుందని వివరించారు. ఓవైపు భారత్‌లో సొంత ప్రజల భద్రతకు కృషి చేస్తూనే మరోవైపు ఇరుగు పొరుగు దేశాలతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడం, సహాయం కోసం అభ్యర్థించిన దేశాలకు నిర్దిష్ట తోడ్పాటు అందించడం చేసిందని తెలిపారు.
కోవిడ్19 మహమ్మారి ఒక రకంగా అంతర్జాతీయ సహకారానికి ఉన్న పరిమితులను బహిర్గతం చేసిందని ప్రధాని చెప్పారు. ఇటీవలి చరిత్రలో తొలిసారిగా మానవాళి ముందు స్పష్టమైన ఉమ్మడి శత్రువు నిలిచిందని తెలిపారు.

గవి గురించి ప్రస్తావిస్తూ ఇది అంతర్జాతీయ కూటమి మాత్రమే కాదని, అంతర్జాతీయ సంఘీభావానికి చిహ్నమని ఆయన తెలిపారు. ఇతరులకు

సహాయపడటమంటే మనకు మనం సహాయం చేసుకున్నట్లేనన్న ఆర్యోక్తికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

భారత జనాభా భారీగా ఉన్నప్పటికీ, వైద్య సదుపాయాలు పరిమితంగానే ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో టీకాల ప్రాధాన్యతపై భారత్‌కు పూర్తి అవగాహన ఉందని తెలిపారు.

విశాలమైన దేశంలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న పిల్లలు మరియు గర్భిణీలకు కూడా పూర్తి స్థాయిలో టీకాలను వేసే దిశగా తమ ప్రభుత్వం మిషన్ ఇంద్రధనుష్‌ను ప్రారంభించిందని ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రారంభించిన తొలి కార్యక్రమాల్లో ఇదీ ఒకటని వివరించారు.

భద్రతను మరింతగా పెంచే దిశగా భారత్ తన జాతీయ టీకా కార్యక్రమంలో కొత్తగా మరో ఆరు టీకాలను జోడించిందని ఆయన తెలిపారు.

మొత్తం టీకాల సరఫరా వ్యవస్థను డిజిటలీకరించడంతో పాటు కోల్డ్ చెయిన్ సామర్థ్యాలను సమీక్షించేందుకు ఎలక్ట్రానిక్ వ్యాక్సిన్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను భారత్ అభివృద్ధి చేసుకున్న తీరును ప్రధాని సవివరంగా తెలియజేశారు.

సముచిత పరిమాణంలో, సరైన సమయంలో చిట్టచివరి వ్యక్తి దాకా సురక్షితమైన మరియు శక్తిమంతమైన టీకాలు చేరేలా ఈ ఆవిష్కరణలు తోడ్పడుతున్నాయని ఆయన తెలిపారు.

ప్రపంచంలోనే అత్యధికంగా టీకాలు ఉత్పత్తి చేసే దేశంగా భారత్ నిలుస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 60 శాతం మంది పిల్లలకు టీకాలు వేసేందుకు తోడ్పడటం భారత్‌కు దక్కిన అదృష్టమని ఆయన పేర్కొన్నారు.

గవి కృషిని భారత్ గౌరవిస్తుందని, అందుకే గవి నుంచి తోడ్పాటు పొందేందుకు అర్హత కలిగి ఉన్నప్పటికీ దాతగా మారిందని శ్రీ మోదీ తెలిపారు.

గవికి భారత్ తోడ్పాటు ఆర్థికపరమైనది మాత్రమే కాదని ప్రధాన మంత్రి తెలిపారు. అంతర్జాతీయంగా టీకాల ధరలు తక్కువ స్థాయికి రావడానికి భారత్‌లో భారీ డిమాండ్ కారణంగా నిలుస్తోంది. దీనివల్ల గడిచిన అయిదేళ్లలో గవి దాదాపు 400 మిలియన్ డాలర్లు ఆదా చేయగలిగింది.

నాణ్యమైన ఔషధాలు మరియు టీకాలను చౌకగా ఉత్పత్తి చేయడంలో భారత్ తన సామర్థ్యాలను నిరూపించుకుందని ప్రధాని చెప్పారు. ఇమ్యూనైజేషన్ను వేగంగా విస్తరించడంలో సొంతంగా ప్రత్యేక అనుభవం గడించడంతో పాటు, పేరొందిన శాస్త్రీయ అధ్యయనాల నిపుణులతో ప్రపంచానికి భారత్ సంఘీభావంగా నిలుస్తోందని ఆయన పునరుద్ఘాటించారు.

ఆరోగ్య సంరక్షణకు సంబంధించి అంతర్జాతీయంగా జరుగుతున్న కృషికి తన వంతు తోడ్పాటు అందించేందుకు భారత్కు పుష్కలమైన సామర్థ్యాలు ఉన్నాయని ప్రధాని చెప్పారు. అంతే గాకుండా పంచుకోవడం మరియు సంరక్షించుకోవడమనే స్ఫూర్తితో పనిచేయడం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

**న్యూఢిల్లీ**
**జూన్ 04, 2020**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.